


# కరపత్రం

SINCE 2014

శనివారం ఆగస్ట్ 9 2025 సంపుటి :0 సంచిక :295 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4

## ఓఆర్ఆర్ వరకు వరదనీటి సమస్య ఉండొద్దు: సీఎం రేవంత్‌రెడ్డి





హైదరాబాద్: నగరంలో వర్షాలు, వరదల ప్రభావంపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. వర్షాలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఆరా తీశారు. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి హైదరాబాద్‌లో తలెత్తిన పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద ప్రవాహానికి అడ్డంకుల వల్లే ఈ దుస్థితి తలెత్తుతోందని అధికారులు వివరించారు. ఓఆర్ఆర్ వరకు వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వరదనీరంతా మూసీకి చేరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. చెరువులు, నాలాలు, కాలువలన్నీ మూసీకి అనుసంధానించాలన్నారు. చెరువుల పునరుద్ధరణ, నాలాల వెడల్పు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

## కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం



- ప్రతి పథకం వెనకా కమీషన్ల బాగోతం
- ఏ పనిచేసినా దోచుకేవడమే లక్ష్యం
- బిఆర్ఎస్ ఎదురుదాడితో తప్పించుకునే ఎత్తుగడ
- ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో మంత్రి పొంగులేటి విమర్శలు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కమీషన్ల కోసమే కట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. వారు ఏ పని చేసినా కమిషన్ల కోసమే చేశారని అన్నారు. తెలంగాణను అడ్డంగా దోచుకున్నారని మండిపడ్డారు. ప్రతి పథకంలో కమిషన్ కోసమే నాటి ప్రభుత్వం పని చేసిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. హన్మకొండ జిల్లాకేంద్రం బాలసముద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

2లో

## ఫోన్ ట్యాపింగ్‌లో వేలకోట్ల వల

- వ్యాపార, సినీ, రాజకీయ ప్రముఖుల బ్లాక్‌మెయిల్
- ఎన్నికల్లో పట్టుబడ్డ వందలకోట్లు కెసిఆర్ ఖాతాలోకి
- భార్యాభర్తల ఫోన్లుకూడా ట్యాప్ చేసిన దుర్మార్గులు
- అత్యధికంగా నా ఫోన్ ట్యాప్ జరిగింది
- ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావులకు ఉరిశిక్ష వేసినా తక్కువే
- సిట్ విచారణతో ఒరిగేదేమీ లేదు
- సిబిఐ విచాణతోనే దొంగలను పట్టుకునే ఛాన్స్
- సిట్ విచారణ అనంతరం మీడియాతో బండి సంజయ్



2లో..

## ఆవరిస్తున్న క్యుములో నింబస్



**భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక**

రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అయితే దక్షిణ తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్నట్టు-వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనంతో మరో నాలుగు రోజులు వానలు దంచికొట్టనున్నాయని పేర్కొంది.

2లో


## విద్యార్థులకు గుడ్‌న్యూస్.. TGSRTC ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు ఆహ్వానం




హైదరాబాద్: ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులకు టీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. హైదరాబాద్ శివారులోని హకీంపేట్‌లో TSRTC ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

2లో

## మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు: మంత్రి ఉత్తమ్



- ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు.

2లో..

## కెటిఆర్‌కు రాఖీ కట్టిన లగచర్ల గిరిజన మహాళలు



భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కొడంగల్ నుంచి వచ్చిన గిరిజన సోదరీమణులు రాఖీ కట్టి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ప్రభుత్వం తమ జీవితాలను, జీవనాధారమైన వ్యవసాయ భూములను లాక్కున్నప్పుడు, తమకు ఒక అన్నలా అండగా నిలిచిన కేటీఆర్‌కు రాఖీ కట్టామని వారు తెలిపారు. కొడంగల్ మండలం లగచర్ల గ్రామం రోటిబండ తండాకు చెందిన జ్యోతి, మరికొంతమంది మహిళలు కేటీఆర్ నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. లగచర్ల భూ పోరాటం సమయంలో నిండు గర్భిణిగా ఉన్న జ్యోతిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారని, ఆమె భర్తను జైలుకు పంపిన, సమయంలో కేటీ-ఆర్ ఢిల్లీ వెళ్లి పలు కమిషన్లకు ఫిర్యాదులు చేసి, జ్యోతితో పాటు- లగచర్ల గిరిజనులకు, పేద రైతన్నలకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ వేదికగా ఎండగట్టారు. దీని ఫలితంగా, ప్రభుత్వం భూసేకరణను వెనక్కి తీసుకుందని వారు తెలిపారు. కేసుల కారణంగా జైలుపాలైన లగచర్ల సోదర సోదరీమణులందరికీ కేటీఆర్ అన్నగా అండగా నిలబడి, న్యాయ సహాయం అందించారని, అందరినీ జైలు నుంచి విడిపించారని వారు తెలియజేశారు.

## సింగూరు ప్రాజెక్టుకు ఎలాంటి ఇబ్బందీ లేదు: ఈఎన్‌సీ జనరల్



సింగూరు: సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టుపై డ్యామ్ సేఫ్టీ అధికారులు నివేదిక ఇచ్చిన నేపథ్యంలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లారు. సింగూరు ప్రాజెక్టు గేట్లు, డ్యామ్ కట్ట నాణ్యతను పరిశీలించారు. నీటి పారుదలశాఖ చీఫ్ ఇంజినీర్ అంజద్ హుస్సేన్, ఈఎన్‌సీ ఆపరేటింగ్, మెయింటెనెన్స్ శ్రీనివాస్, చీఫ్ ఇంజినీర్ సెంట్రల్ డిజైన్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తదితరులు ప్రాజెక్టు నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఈఎన్‌సీ జనరల్ మాట్లాడుతూ ప్రాజెక్టుకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. టెంపరరీ మరమ్మతులకు నిధులు కేటాయించామని, సింగూర్ ప్రాజెక్టు డేంజర్ జోన్‌లో లేదని తెలిపారు. వేసవిలో పూర్తి స్థాయి మరమ్మతులు చేస్తామన్నారు. నీరు బేస్ లెవెల్‌కు తగ్గే వరకు ఏమీ చేయలేమన్న ఆయన.. ప్రాజెక్టులో స్టోరేజీ ఎక్కువగా లేకుండా చూస్తామన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 9 2025

# సంపాదకీయం

## ఆటలో గెలవాలంటే ఆడితీరాలి

ప్రజాస్వామ్య పండుగ అయిన ఎన్నికలలో పాల్గొనడమనేది పౌరుల హక్కే కాదు, బాధ్యత కూడా. ప్రజలు ఆ హక్కును సద్వినియోగపరిచి, తమ ప్రజాస్వామ్య బాధ్యతను నెరవేర్చేలా చూడడమనేది రాజకీయ పార్టీల, ముఖ్యంగా అధికారంలో ఉన్న పార్టీల విద్యుక్త ధర్మం. అయినా కొన్ని రాజకీయ పార్టీలు లేదా ప్రజా వర్గాలు అప్పుడప్పుడూ ఎన్నికలలో పాల్గొనేందుకు నిరాకరించడం, ఆ ప్రజాస్వామిక ప్రక్రియను బహిష్కరించడం జరుగుతోంది. తద్వారా, ఎన్నికలలో పాల్గొనడం కంటే పాల్గొనకపోవడం ద్వారా ప్రభుత్వానికి, సమాజానికి తమ వైఖరి ఏమిటో స్పష్టాతి స్పష్టంగా చెప్పడమవుతుందని పార్టీలు లేదా ప్రజా వర్గాలు భావిస్తున్నాయి. పార్టీలు లేదా ప్రజావర్గాలు ఎన్నికలను బహిష్కరించడమనే ఎత్తుగడ పాత, కొత్త ప్రజాస్వామ్య వ్యవస్థల్లో పునరావృతమవుతున్న లక్షణంగా ఉన్నది. అయితే చరిత్ర ఈ పరిణామం గురించి ఒక సత్యాన్ని చెప్పుతోంది: ఎన్నికల బహిష్కరణలు అరుదుగా విజయవంతమయ్యాయి. అవి చాలావరకు విఫలమయ్యాయని, ప్రతిపక్షాలను బలహీనపరిచాయని, అధికారంలో ఉన్న పార్టీలు లేదా నాయకులకే మరింత అనుకూల పరిస్థితులు సృష్టించాయని కూడా చరిత్ర స్పష్టం చేసింది. ఈ సంవత్సరాంతంలో బిహార్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలను బహిష్కరించాలని ప్రతిపక్షాలు గట్టిగా పిలుపునిస్తున్నాయి. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -సర్) పట్ల సందేహాలు, సంకోచాలతో విపక్షాలు అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించేందుకు సమాయత్తమవుతున్నాయి. ఓటర్ల పేర్లను భారీ ఎత్తున జాబితా నుంచి తొలగించే లక్ష్యంతోనే 'సర్'ను చేట్టారని, దీనివల్ల పేదలు, మైనారిటీలు, వలసపోయినవారు తీవ్రంగా నష్టపోనున్నారని 'సర్' విమర్శకులు ధ్వజమెత్తుతున్నారు. ఓటర్ల ధ్రువీకరణ ప్రక్రియ పారదర్శకంగా లేకపోవడంతో సర్ నిష్పాక్షికతను ప్రజలు విశ్వసించలేకపోతున్నారు.

ఎన్నికల సంఘం పట్ల బిహార్ ప్రజల్లో అపనమ్మకం నెలకొన్నది. ఓటర్లు లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం తక్షణమే ఎటువంటి సందేహాలకు తావివ్వని రీతిలో సమాధానాలు ఇవ్వవలసిన అవసరమున్నది. అయితే ఇదే సమయంలో సర్ పట్ల ఆక్షేపణతో ఎన్నికలను బహిష్కరించడం ఎంతవరకు సబబు అనే విషయాన్ని నిశితంగా పరీక్షించవలసిన అవసరమున్నది. ఎన్నికల బహిష్కరణ విషయమై చాలా జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని దక్షిణాసియా అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) 2014లో పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరించింది. అధికారంలో ఉన్న అవామీలీగ్ రాజీనామా చేసి, ఎన్నికల నిర్వహణకు ఒక తటస్థ ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించాలని బీఎన్‌పీ డిమాండ్ చేసింది. అవామీలీగ్ నిష్పాక్షికత పట్ల బీఎన్‌పీ అనుమానాలు నిరాధారమైనవి కావు. అయితే బీఎన్‌పీ ఎన్నికలను బహిష్కరించడం ద్వారా అధికార పార్టీకి చెప్పుకోదగ్గ పోటీ లేకుండా చేసింది. ఫలితంగా 153 నియోజకవర్గాలలో అవామీలీగ్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ ఎన్నికల అనంతరం నేను ఢాకాకు వెళ్లాను. బీఎన్‌పీ ఎన్నికలలో పోటీ చేసి ఉంటే తప్పకుండా గెలిచేదని చాలా మంది నాకు స్పష్టంగా చెప్పారు అధికార అవామీలీగ్‌కు విజయాన్ని బీఎన్‌పీ స్వయంగా సమకూర్చిందని వారు అభిప్రాయపడ్డారు. భారత్‌లో కూడా ఎన్నికల బహిష్కరణ జరిగింది. పంజాబ్‌లో 1992 అసెంబ్లీ ఎన్నికలు ఇందుకొక ఉదాహరణ. శిరోమణి అకాలీదళ్ ఆ అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించింది. ఫలితంగా ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదయింది. కొన్ని జిల్లాల్లో కేవలం 13 శాతం ఓటర్లు మాత్రమే పోలింగ్‌లో పాల్గొన్నారు. అకాలీదళ్ బాయ్‌కాట్ కాంగ్రెస్ పార్టీకి సులభ విజయాన్ని సమకూర్చింది. పోటీ రహితంగా ఎన్నికలు జరగడం, శాసనసభలో ప్రతిపక్షం లేకపోవడంతో పంజాబ్‌లో ప్రజాస్వామ్యం సార్థకత కోల్పోయింది. ఇంకా పలు బహిష్కరణల ఉదంతాలు ఉన్నాయి. అయితే వాటిలో చాలా భాగం ప్రధానస్రవంతిలో లేని వేర్పాటువాద పార్టీలు ఇచ్చినవే. జమ్మూ కశ్మీర్ వేర్పాటువాద గ్రూపులు మొదటి నుంచీ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిస్తూనే ఉన్నాయి.

ఎన్నికలలో తాము పాల్గొనడం జరిగితే కశ్మీర్‌లో భారత పరిపాలనకు న్యాయసమ్మతి కల్పించడమే అవుతుందని వేర్పాటువాదులు తమ నిర్ణయాన్ని సమర్థించుకునేవారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో కూడా ఎన్నికల బహిష్కరణ పిలుపులు విజయవంతమవలేదు. వెనిజులా ఇందుకొక ఉదాహరణ. 2005లో ప్రతిపక్షాలు ఎన్నికలను బహిష్కరించాయి. ఫలితంగా జాతీయ అసెంబ్లీలో ప్రతి సీటునూ పాలక కూటమి గెలుచుకున్నది. 2018లో పాక్షికంగా బహిష్కరించాయి. నికోలస్ మదురో మళ్లీ అధ్యక్షుడుగా ఎన్నికయ్యేందుకు ఈ బహిష్కరణ తోడ్పడింది. 2020లో కూడా ప్రతిపక్షాలు ఎన్నికలలో పాల్గొనకపోవడంతో 31 శాతం ఓటర్లే పోలింగ్‌లో పాల్గొన్నారు. ఈ తక్కువ శాతం పోలింగ్‌తో అధికార పార్టీకి భారీ మెజారిటీ లభించింది. జింబాబ్వేలో మోర్గాన్ స్వాన్‌గిరాయి 2008 అధ్యక్ష ఎన్నికల నుంచి ఉపసంహరించుకున్నారు. దీంతో రాబర్ట్ ముగాబే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల బహిష్కరణ వల్ల గానీ లేదా ఓటర్లు చాలా తక్కువగా పోలింగ్‌లో పాల్గొన్న కారణాన గానీ సంబంధిత ఎన్నికను రద్దు చేసే సౌలభ్యాన్ని భారత రాజ్యాంగం కల్పించలేదు. షెడ్యూలు ప్రకారం ఎన్నికల సంఘం విధిగా ఎన్నికలు నిర్వహించి, పోలయిన ఓట్ల ప్రాతిపదికన విజేతలు ఎవరో ప్రకటిస్తుంది. కనుక ఎన్నికల బహిష్కరణ పిలుపు ఎన్నికల ప్రక్రియను నిరోధించలేదు, నిరోధించజాలదు. పార్టీలు లేదా అభ్యర్థులు పోటీనుంచి వైదొలిగిన పక్షంలో అది బరిలో ఉన్న అభ్యర్థికి సులభ విజయం సమకూర్చడానికి మాత్రమే దోహదం చేస్తుంది. ఈ కారణంగానే బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వివాదానికి ప్రతిస్పందనగా ఎన్నికలను బహిష్కరించాలన్న తమ పిలుపుపై ఆ రాష్ట్రంలోని ప్రతిపక్షాలు పునరాలోచన చేయవలసిన అవసరమున్నది. అయితే 'సర్' ప్రక్రియను నిశితంగా పరీక్షించాలి. ప్రత్యేక సమగ్ర సవరణపై రాజకీయ పార్టీలు, పౌర సమాజం వ్యక్తం చేస్తున్న అనుమానాలను తొలగించాలి. ఆ సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానికి ఉన్నది. ఓటర్ల ఫిర్యాదులను శీఘ్రగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు అన్నీ చేపట్టాలి. పౌర సమాజం, మీడియా, న్యాయస్థానాలు అన్నీ 'సర్' విషయంలో జాగరూకతతో ఉండాలి. ఎన్నికలలో పాల్గొనే బాధ్యతను రాజకీయ పార్టీలు ఎట్టి పరిస్థితులలోను వదిలివేయకూడదు. ఎన్నికల బరి నుంచి వైదొలగడమంటే ఎన్నికల పోరులో ఓడిపోవడమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలలో పాల్గొనక పోవడం నిరసన ఎంత మాత్రంకాదు, అది బాధ్యతను పరిత్యజించడమే అవుతుందన్న సత్యాన్ని విస్మరించకూడదు. ఎన్నికల బహిష్కరణే కాదు, పార్లమెంటు సమావేశాలను బహిష్కరించడం కూడా ప్రతిపక్షాలు తమను తాము ఓడించుకోవడమే అవుతుంది. వాకౌట్‌లు, సభా కార్యక్రమాలకు ఎగతెగకుండా అంతరాయం కలిగించడం కొన్ని సందర్భాలలో ప్రతీకాత్మక నిరసన కావచ్చునేమో కానీ, వాటి ఆచరణాత్మక ప్రభావం వల్ల కీలక బిల్లులను ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించే స్వేచ్ఛ పాలక పక్షానికి లభిస్తుంది. అనేక కీలక బిల్లులు-2020లో మూడు కొత్త సాగు చట్టాలు, అంతకు ముందు సంవత్సరాలలో కీలక రాజ్యాంగ సవరణలు%-% ప్రతిపక్ష ఎంపీల వాకౌట్ల వల్లే ఆమోదించడం అధికార పార్టీకి వీలయింది.

# ఫోన్ ట్యాపింగ్‌లో వేలకోట్ల వల

మొదటి పేజీ తరువాయి

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోమారు డిమాండ్ చేశారు. ఇందులో లోతుగా విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లోని దిల్‌కుషా అతిథి గృహంలో సిట్ విచారణకు హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అందుకే కేసీఆర్ కుటుంబానికి సీఎం క్లీన్ చిట్ ఇచ్చారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సిట్‌కు అధికారాలు లేవని, విచారణతో కాలయాపన తప్ప ఇంకేం జరగదని అన్నారు. గతంలో భారత రాష్ట్ర సమితి దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోందని దుయ్యబట్టారు. సిబిఐ విచారణకు ఎందుకు వెనకాడుతున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా నా ఫోన్ కాల్స్‌నే ట్యాప్ చేశారు. నా కుటుంబ సభ్యులు, పని మనుషుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. భార్యాభర్తల ఫోన్లూ ట్యాప్ చేసి విన్నారు. నా వద్ద ఉన్న ఆధారాలు, సమాచారం అధికారులకు ఇచ్చాను. వాస్తవానికి మావోయిస్టులకు సంబంధించిన ఫోన్లు ట్యాప్ చేయాలి. కానీ, ఆ జాబితాలో మా పేర్లు పెట్టి ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మొదటిసారి వాంగ్మూలం ఇచ్చింది నేనే. కేసీఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా ఫోన్లు ట్యాప్ చేసింది. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. గత ప్రభుత్వంలో సాధారణ ఫోన్ కాల్స్ మాట్లాడేందుకు భయపడి వాట్సప్ కాల్స్ మాట్లాడేవాళ్లు. అప్పటి భారత రాష్ట్ర సమితి మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని బండి అన్నారు.

కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు ట్యాప్ చేశారు. వారినీ విచారణకు పిలవాలి. ఎస్ఐబీని సొంత అవసరాలకు అడ్డాగా కేటీఆర్ మార్చారు.నాయకులు, లాయర్లు, వ్యాపారులు, సినీ నటులు,ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. టీ-ఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు విచారిస్తున్న హైకోర్టు జడ్జి ఫోన్ కూడా ట్యాప్ చేశారు. ఫోన్ల ట్యాపింగ్ ద్వారా అనేక లావాదేవీలకు సంబంధించి లబ్ధి పొందారు. ప్రభాకర్‌రావు, రాధా కిషన్‌రావు బాగోతం చెబుతుంటే నాకే సిగ్గనిపించింది. వారిద్దర్నీ సమాజం క్షమించదు. ఇద్దరికీ ఉరిశిక్ష వేస్తే ఒకేసారి చనిపోతారు.. క్షణక్షణం బాధపడాలి. మా కార్యకర్తలను, ఇతర పార్టీ నాయకులను క్షోభకు గురి చేశారు. ఇద్దరు నిందితులను కాపాడే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోంది. వ్యాపారుల లావాదేవీలు తెలుసుకొని కేటీఆర్ బ్లాక్‌మెయిలింగ్ చేశారని బండి అన్నారు.

ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి వద్ద రూ.7 కోట్లు- పట్టుకున్నారు. ఆ డబ్బు ఏమైందో తెలియదు. చాలామంది నాయకుల వద్ద రూ.వందల కోట్లు- సీజ్ చేసి పట్టుకున్నారు. పట్టుబడిన డబ్బులను కేసీఆర్, కేటీఆర్‌కు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు పంపారు. రూ.20 కోట్లు- దొరికితే.. కేసీఆర్, కేటీఆర్ ఫోన్ చేశాక రూ.2 కోట్లు- అవుతాయి. రూ. వేల కోట్లు- అక్రమాలు జరిగితే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోదా? ఈడీకి లేఖ రాస్తే విచారణ జరుపుతుంది. సిట్ అధికారులు నిజయితీ పరులు, వారిపై మాకు అనుమానం లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైనే మా అనుమానం అంతా. ఫోన్లు ట్యాప్ చేసినట్లు- ఆధారాలున్నా ఎంతకాలం గడుపుతారు. కమిషన్లు వేసి కాలయాపన చేస్తారు. నివేదికలు ఇచ్చినా చర్యలు లేవు. ఏడాది గడిచినా ఒక్క నాయకుడిని అరెస్టు చేయలేదని బండి సంజయ్ అన్నారు. తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సిట్ అధికారులు అందించిన వివరాలు చూసి తాను షాక్ అయినట్లు- మంత్రి బండి సంజయ్ తెలిపారు. తన ఫోన్, తన కుటుంబ సభ్యులతోపాటు- తన ఓఎస్డీ, వ్యక్తిగత సిబ్బంది ఫోన్ ట్యాప్ అయినట్లు- చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ అవుతున్నట్లు- తాను గుర్తించానని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో తన ఫోన్లు ఎక్కువ సార్లు ట్యాప్ చేశారని పేర్కొన్నారు. మావోయిస్టుల జాబితాలో తమ పేర్లు పెట్టి ట్యాప్ చేశారని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయి నాయకులతో తాను మాట్లాడిన అన్ని కాల్స్ ట్యాప్ చేశారని వివరించారు. టీ-బీజేపీ చీఫ్‌గా ఉన్న సమయంలో తన చుట్టూ నిఘా పెట్టారని విమర్శించారు. వావివరసలు లేకుండా ఫోన్లు ట్యాప్ చేశారంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ ఫోన్ల ట్యాపింగ్ వెనుక బీఆర్ఎస చీఫ్ కేసీఆర్ పాత్ర ఉందని కుండ బద్దలు కొట్టారు. కేసీఆర్ పాలనలో సామాన్యులు సైతం ఫోన్లు మాట్లాడ లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో భార్యాభర్తల ఫోన్ సంభాషణలూ కూడా విన్నారంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలకంగా వ్యవహరించిన ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావులకు ఉరిశిక్ష విధించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులను రేవంత్ ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు. వ్యాపారస్తుల ఫోన్లు ట్యాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. ఎన్నికల సమయంలో దొరికిన నగదంతా కేసీఆర్ ఖాతాల్లోకి వెళ్లాయని ఆరోపించారు. ఈ కేసును ఇంకా ఎంత కాలం సాగదీస్తారు? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ కేసులో ఇప్పటివరకు కేసీఆర్ కుటుంబంలో ఒక్కరినైనా అరెస్టు చేశారా? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బండి సంజయ్ నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని సిట్ కార్యాలయంలో అధికారుల విచారణకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. దాదాపు రెండు గంటలపాటు- బండి సంజయ్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో సాక్షిగా బండి సంజయ్ అందించిన వాంగ్మూలాన్ని వారు రికార్డు చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలను సిట్ అధికారులకు బండి సంజయ్ అందజేశారు. తెలంగాణ బీజేపీ చీఫ్ అయినప్పటి నుంచి మీ ఫోన్ ట్యాప్ అయినట్లు- బండి సంజయ్‌కు సిట్ అధికారులు వివరించారు. అలాగే ఎవరితో ఎంత సేపు మాట్లాడారన్న డేటాను సైతం ఆయనకు వారు సాక్ష్యాలతో సహా చూపించారు. మునుగోడు, హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో రాజకీయ నేతలతో బండి సంజయ్ మాట్లాడిన డేటాకు సంబంధించిన వివరాలను ఆయనకు సిట్ అధికారులు ఈ సందర్భంగా అందజేశారు.

## ఆవరిస్తున్న క్యుములో నింబస్

మొదటి పేజీ తరువాయి

నల్లగొండ, యాదాద్రి, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక క్యుములో నింబస్ మేఘాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇవాళ సాయంత్రం, రాత్రి సమయాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం కూడా నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నిన్నటి అంత వర్షం కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం వరకు ఎలాంటి వర్ష సూచన లేదన్నారు. సాయంత్రం వేళ పలుచోట్ల ఉరుములు, మెరుపులు సంభవించనున్నాయి.

మరో ఐదు రోజులపాటు- తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. 9, 10 తేదీల్లో నల్గొండ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 11, 12వ తేదీల్లో తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కరిసే అవకాశం ఉందని

తెలిపింది. 13వ తేదీన తెలంగాణలోని అన్ని జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

## విద్యార్థులకు గుడ్‌న్యూస్.. TGSRTC ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

ఎనిమిది, పదో తరగతి విద్యార్హతతో మోటార్ వెహికల్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో కోర్సులు అందిస్తున్నట్లు పేర్కొంది. అర్హులైన, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆగస్టు 28లోగా తమ వెబ్‌సైట్‌లో http://iti.telangana.gov.in దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. వాక్ ఇన్ ఫేజ్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు మరింత సమాచారం కోసం 9100664452, 6302649844, 040-69400000 ఫోన్ నంబర్లను సంప్రదించాలని టీజీఎస్‌ఆర్టీసీ సూచించింది. మెకానిక్ డీజిల్, వెల్డర్ కోర్సులు ఒక ఏడాది కోర్సులు కాగా.. మెకానిక్ (మోటర్ వెహికల్), పెయింట్ కోర్సులు రెండేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. వెల్డర్, పెయింటర్ కోర్సులకు ఎనిమిదో తరగతి విద్యార్హతగా నిర్ణయించారు. ఈ కోర్సులకు ఏడాదికి రూ.16,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, చాదర్‌ఘాట్, సైదాబాద్, సరూర్‌నగర్, చంపాపేట్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం పడుతోంది. క్యుములోనింబస్



మేఘాల ప్రభావంతో మరో నాలుగు రోజుల పాటు వర్ష సూచన ఉన్నట్లు ఇవాళ సాయంత్రం హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించిన సంగతి తెలిసిందే.

## కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను ఆపేందుకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుట్రచేస్తున్నాయని విమర్శించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ చూసి, బీఆర్ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. అయినా కూడా బీఆర్ఎస్ నేతలు నిస్సిగ్గుగా తమపై ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదవాళ్లకు సక్రమంగా ఇల్లు ఇస్తే ఇవాళ ఇల్లు అడిగేవారు కాదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ చూసి, బీఆర్ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటు-న్నారని చెప్పారు. అయినా కూడా బీఆర్ఎస్ నేతలు నిస్సిగ్గుగా తమపై ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదవాళ్లకు సక్రమంగా ఇల్లు ఇస్తే ఇవాళ ఇల్లు అడిగేవారు కాదని స్పష్టం చేశారు. కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా జిల్లా కేంద్రంలో 592 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేసినట్లు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన 18 నెలలుగా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా దూసుకుపోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారిణి రహిమున్నీసాబేగానికి తొలి పట్టా అందించినట్లు- మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏ పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా ఎంపిక చేసినట్లు చెప్పారు. 'పార్టీలకు అతీతంగా పేదవాడైతే చాలు.. ఇళ్లు ఇవ్వాలని అధికారులకు చెప్పాం. పేదల ముఖంలో నవ్వు చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లను కొందరికి మాత్రమే ఇచ్చింది. పదేళ్ల పాటు- ఎవరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 6.50 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చాం. రైతుభరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు- జమ చేశాం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం వేల కోట్ల కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కూలింది. నిర్మాణంలో జరిగిన అక్రమాలను విచారణ కమిషన్ బయటపెట్టింది. బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను కేంద్రంలోని భాజపా ఆమోదించలేదు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న భాజపాకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పొంగులేటి తెలిపారు.

## మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు: మంత్రి ఉత్తమ్


మొదటి పేజీ తరువాయి


హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. అవసరమైన అనుమతులపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ నిర్వహిస్తారని చెప్పారు. శుక్రవారం నీటిపారుదశాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు జరుగుతున్నట్లు చెప్పారు. "ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం తర్వాత నిపుణుల కమిటీ సిఫార్సులతో తిరిగి పనులు మొదలుపెట్టాలి. ముఖ్యమైన ప్రాజెక్టు 9 కి.మీ పనికే నిలిచిపోవడం దురదృష్టకరం. ఎస్ఎల్‌బీసీ పూర్తి కానందున ఎత్తిపోతలకు ఏటా రూ.750 కోట్లు ఖర్చవుతోంది. అత్యాధునిక సాంకేతికతతో ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్జీఆర్ఐ సర్వేతో భూగర్భం కి.మీ దిగువ వరకు మ్యాపింగ్ చేయొచ్చు. కచ్చితమైన ప్రణాళిక కోసం లైడార్ సర్వే కూడా చేస్తాం. నాణ్యతలో రాజీపడకుండా మంత్రివర్గం ఆమోదించిన అంచనాతో ప్రాజెక్టు పనులు చేపట్టాలి"అని మంత్రి తెలిపారు. మరోవైపు ఎస్ఎల్‌బీసీ సొరంగానికి హెలికాప్టర్‌తో మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వేకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.2.36 కోట్లతో నామినేషన్ పద్ధతిన ఎన్జీఆర్ఐకి పనులు అప్పగించింది. అలాగే, నీటిపారుదల శాఖలో 46 మంది ఈఈలకు ఎస్ఈలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 123 మంది ఏఈఈలకు డీఈఈలుగా పదోన్నతి కల్పించింది.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం ఆగస్ట్ 9 2025

# రాహుల్ గాంధీ పేల్చిన ఆటబాంబు

- కొండను తవ్వి ఎలుకను పట్టిన ప్రతిపక్ష నాయకుడు
- ప్రయోగించిన ఆటంబాంబు అడ్రస్ లేకుండా పోయింది
- ఆటబాంబుగా రూపాంతరం చెందిన అణుబాంబు




**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

ఎన్నికల కమిషన్ పనితీరును ప్రశ్నిస్తాను ఆటంబాంబు పేలుస్తాను అంటూ చెబుతూ వచ్చిన రాహుల్ గాంధీ ఏడవ తేదీన పేల్చేశాడు.రాహుల్ ఆటంబాంబు, ఆట బాంబుగా మారింది. ఒక విస్తృతమైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో, విశాలమైన ప్రెస్ కాన్ఫరెన్స్ తో రాహుల్ గాంధీ ప్రదర్శించిన షో ఒక ఆటగా మాత్రమే మిగిలింది.రాహుల్ గాంధీ పేల్చిన అణుబాంబు, అణువంత కూడా ప్రభావం చూపలేకపోయిందని విలేకరుల ప్రశ్నలతోనే తేలిపోయింది.

### - రాహుల్ చూపించినవి ఆధారాలు కాదు

తన మొత్తం ప్రజెంటేషన్ లో రాహుల్ గాంధీ ఎన్నుకున్నది కర్ణాటకలోని మహదేవ్ పుర అనే అసెంబ్లీ నియోజకవర్గం మాత్రమే. ఈ నియోజకవర్గంలో "ఆధిత్య శ్రీ వాత్సవ" అనే వ్యక్తికి రెండు చోట్ల ఓటరు ఫోటో గుర్తింపు కార్డ్ (EPIC ) ఉందని ఒక ఆధారాన్ని చూపే ప్రయత్నం చేశాడు.ఈ ఆధిత్య శ్రీ వాత్సవ ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర మరియు కర్ణాటక రాష్ట్రాల్లో కూడా ఓటరుగా నమోదు చేసుకున్నాడని రాహుల్ గాంధీ ఆరోపించాడు.రాహుల్ గాంధీ ఈ ఆరోపణ చేస్తున్నప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్న మూడు రాష్ట్రాల ఎన్నికల కమిషన్ అధికారులు వెంటనే విషయ సేకరణ, వాస్తవాల నిర్ధారణ జరుపుతూ పోయారు. మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ ప్రస్తావించిన ఆధిత్య శ్రీ వాత్సవ గురించి సమాచారం సేకరిస్తూ పోయారు. రాహుల్ గాంధీ ప్రకటించిన ఆధిత్య శ్రీ వాత్సవ ఎన్నికల ఫోటో గుర్తింపు కార్డు లోని నెంబర్ ను
పరిశీలించారు. మహారాష్ట్రలో గాని ఉత్తర్ ప్రదేశ్ లో గాని ఈ ఓటర్ ఆధిత్య శ్రీ వాత్సవ ఓటరుగా నమోదు కాలేదని అతివేగంగా ప్రకటించారు.రాహుల్ గాంధీ ఆరోపించినట్టుగా కర్ణాటకలోని మహదేవ్ పుర నియోజకవర్గంలో రెండు చోట్ల ఓటరుగా ఈ వ్యక్తి నమోదు కాలేదు. కేవలం ఒకచోట మాత్రమే ఓటరుగా ఆధిత్య శ్రీ వాత్సవ పేరు నమోదయిందని ఎన్నికల కమిషన్ అధికారికంగా ప్రకటించింది.

### - దీనితో రాహుల్ గాంధీ గాంభీర్యం పలచన అయిపోయింది

మనదేశంలో ప్రతి ఓటరుకు ఒక ఎన్నికల గుర్తింపు నెంబర్ (EPIC) ఉంటుంది.
ఒకే ఓటరు తన గుర్తింపు కార్డుల ఆధారంగా సాధించుకున్న ఈ పి ఐ సి ని చెకింగ్ చేస్తే అతడు ఎక్కడెక్కడ ఓటరుగా నమోదయి ఉన్నాడో ఆన్ లైన్ లో తెలుసుకునే సాంకేతిక సౌలభ్యం బహిరంగం.
ఒక వ్యక్తి తన ఈపిఐసి తో ఒకటి కంటే అధిక స్థానాల్లో ఓటరు గుర్తింపు పొందడాన్ని అడ్డుకోవడానికి ఎన్నికల సంఘం SIR ద్వారా సమగ్రమైన లోతైన విచారణ జరుపుతున్నది.రాహుల్ గాంధీ కానీ, ఏ ఇతర రాజకీయ నాయకుడు గానీ, రాజకీయ పార్టీ గాని ఈ పరిశీలనను విచారణను స్వాగతించాలి.

### - రాహుల్ గాంధీ ఉద్దేశం ఏమిటి?

రాహుల్ గాంధీ లేవనెత్తిన ఈ అంశాన్ని ఇప్పుడు ఎన్నికల కమిషన్ ప్రత్యేక సమగ్ర రివిజన్ ద్వారా బీహార్ రాష్ట్రంలో పరిశీలన జరుగుతున్నది.బీహార్ లో జరుగుతున్న ఈ సమగ్ర ఓటర్ల రివిజన్ ను ఆపడానికి రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ తో పాటు మిగతా రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టు కు వెళ్లి ఈ క్రతువును ఆపడానికి ప్రయత్నించిన విషయం భారతీయులు గమనించారు.
త్వరలో జరగబోయే బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో ఈ సమగ్ర ఓటర్ల విచారణను ప్రతిపక్షాలు ముఖ్యంగా రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ లు కలిసి ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి ?.
మన దేశంలో పరిహాసంగా మారిన ఎన్నికల ప్రక్రియను దారిలో పెట్టడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలి. మరి ఈ కృషిని ఆపడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారు.
ఒక రాష్ట్రంలో ఉంటూ వేరే రాష్ట్రంలో కూడా ఓటు కలిగి ఉండడం కరెక్ట్ కాదు. అలాగే చనిపోయిన వ్యక్తుల ఓట్లు కూడా ఎన్నికల లిస్ట్ లో ఉండడం కరక్ట్ కాదు. అలాగే దొంగ గుర్తింపు కార్డులతో విదేశీయులు మనదేశంలో ఓటు హక్కు కలిగి ఉండడం నేరం కూడా.ఇటువంటి పవిత్ర వడబోత కార్యక్రమాన్ని అడ్డుకుంటున్న రాహుల్ గాంధీ ఉద్దేశం ఏమిటి?.

### - ఆధారాలున్నప్పుడు ఎన్నికల సంఘానికి రాహుల్ గాంధీ ఎందుకు ఫిర్యాదు చేయలేదు?

హర్యానాలో కూడా ఇలా పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదయ్యాయని రాహుల్ గాంధీ ఆరోపించారు.
ప్రతి ఎన్నికకు ముందు ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన పార్టీలందరితో సమావేశం ఏర్పాటు చేసి తగిన సలహాలు సూచనలు ఆహ్వానిస్తుంది. ఇది ఆనవాయితీ.
హర్యానా ఎన్నికలకు ముందుగానీ, మహారాష్ట్ర ఎన్నికలకు ముందుగానే కాంగ్రెస్ పార్టీతో సహా ఏ పార్టీ కూడా ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు.

అకస్మాత్తుగా ఎన్నికల కమిషన్ ను టార్గెట్ చేయడానికి కారణం ఏమిటి?

పార్లమెంటు సమావేశాల్లో ఆపరేషన్ సింధూర్ తో కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ఎదురుచూసిన ప్రతిపక్షాలు నీరుగారిపోయాయి.
అమెరికా ట్రంప్ భారత్ పాకిస్తాన్ మధ్య రాజీ కుదిరించానని 25 సార్లు ప్రకటన చేస్తే మోడీ ఎందుకు స్పందించడం లేదు అని ఒక పేలవమైన ఆరోపణతో కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసే ప్రయత్నం చేసే విఫలమయ్యాడు.త్వరలో జరగబోయే బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమ వలసదారుల ఓట్లు, ఇతర దొంగ ఓట్లను గుర్తించి సమగ్ర సవరణ చేస్తుంటే రాహుల్ గాంధీకి ఎందుకు ఇబ్బంది కలుగుతున్నది.పైకి ఎన్ని మాట్లాడినా, భారత ప్రజలు ఓటర్లు ఈ సెక్యులర్ నాటకాన్ని స్పష్టంగా అర్థం చేసుకున్నారు.బంగ్లాదేశ్ నుండి ముస్లింలు, మయన్మార్ నుండి వచ్చిన రోహింగ్యాలు ఈ రెండు రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో ఓటర్లుగా నమోదయ్యారు.ఈ అక్రమ వలసదారులు రకరకాల గుర్తింపు కార్డులతో మొత్తం ఎన్నికలను ప్రభావితం చేసే స్థితికి చేరుకున్నారు. దీనితో ప్రపంచంలోనే ఉత్తమోత్తమమైన మన ప్రజాస్వామ్య ప్రక్రియ దెబ్బతింటున్నది. దీన్ని సవరించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిది.

### - భారత రాజ్యాంగం ఆర్టికల్ 324 ప్రకారం మన భారత ఎన్నికల సంఘానికి ప్రత్యేక అధికారాలు దఖలు పడ్డాయి

మన భారతదేశం స్వతంత్రమైన దగ్గర నుండి మన ఎన్నికల సంఘం పనిచేస్తూనే ఉంది.స్వాతంత్ర్య అనంతరం కాంగ్రెస్ పార్టీ అప్రతిహతంగా దేశాన్ని పాలించింది.ఎన్నికల సంఘం విధులు బాధ్యతలు కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణంగా తెలుసు. ఒకవేళ ఇప్పుడు ఎన్నికల సంఘం ఒక రాజకీయ పార్టీకి తోలుబొమ్మగా మారే అవకాశం ఉందని రాహుల్ గాంధీ ఆరోపణలు చేస్తే, ఆ ఆరోపణలు తన పార్టీకే వర్తిస్తాయి.
ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ పార్టీ గతంలో పావుగా వాడుకున్నదా?.. అలా ఎన్నికల సంఘం ఒక పార్టీకి తాబేదారుగా గతంలో మారిందా లేదా అనే విషయాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది.

### - నిరాధార ఆరోపణలకు శిక్షలు ఉంటాయి

బెంగళూరులో రాహుల్ గాంధీ ఎన్నికల కమిషన్ పై ఆరోపణలతో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో ఎలాంటి రుజువులు ఉన్నా, ఆధారాలు ఉన్నా వ్రాతపూర్వక ఫిర్యాదు సమర్పించాలని ఎన్నికల సంఘం రాహుల్ గాంధీని కోరింది.రాజకీయ ప్రకటనలతో ఆరోపణలు చేసి తప్పించుకుంటే మేము ఏమి చేయలేము. ఈ ఆరోపణల పట్ల ఎలాంటి చర్యలు తీసుకోలేము అని ఎన్నికల కమిషన్ రాహుల్ గాంధీకి స్పష్టం చేసింది.ఎన్నికల కమిషన్ ఒక రాజకీయ వ్యవస్థ కాదు. అది సర్వసత్తాక ప్రజాస్వామిక సంస్థ. రాహుల్ గాంధీ లిఖితపూర్వక ఫిర్యాదు చేయాలని, చేసేముందు తన ఆరోపణలు సరిచూసుకొని ఫిర్యాదు సమర్పించాలని కోరింది.ఈ ఫిర్యాదు పై ఎన్నికల కమిషన్ స్పష్టమైన రతపూర్వక జవాబు ఇస్తుందని రాహుల్ గాంధీకి తెలియజేసింది.రాహుల్ గాంధీ గనుక తప్పుడు ఆరోపణలు చేశారని రుజువైన పక్షంలో భారత ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 లోని సెక్షన్ 31 ప్రకారం తగిన శిక్షకు అర్హులవుతారని తెలియజేసింది.
ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఫిర్యాదు తప్పు అని, ఆరోపణలు తప్పు అని రుజువైన పక్షంలో రాహుల్ గాంధీ ఎన్నిక రద్దవుతుందని ఎన్నికల కమిషన్ తెలియజేసింది. అంతేకాదు చట్ట ప్రకారం శిక్షకు కూడా అర్హులవుతాడని తెలియజేసింది.

### - కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు పార్లమెంట్ ఎన్నికలు జరిగి రెండు సంవత్సరములు దాటింది

అకస్మాత్తుగా ఇప్పుడు కొత్తగా ఈ ఆరోపణలు ఎందుకు చేయాల్సి వస్తుంది.హర్యానా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగి కూడా సంవత్సరం పైగా కాలం పూర్తయింది.
మహారాష్ట్రలో, హర్యానాలో పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల మధ్య లక్షలాదిగా దొంగ ఓట్లు చేరాయని.
దానివల్ల గెలుపు ఓటములు తారుమారు అయ్యాయని ఇప్పుడు రాహుల్ గాంధీ ఆరోపించడం ఒక అనుమానానికి కారణం అవుతున్నది.మహారాష్ట్ర పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తరువాత, అసెంబ్లీ ఎన్నికల అప్పుడు లక్షలాది ఓట్లు జోడించబడ్డాయని రాహుల్ గాంధీ ఆరోపిస్తున్నారు. ఆ ఆరోపణ అక్కడ మహారాష్ట్రలో కానీ, హర్యానాలో కానీ చేయకుండా రాహుల్ గాంధీ కర్ణాటకను ఎన్నుకోవడం పూర్తిగా ఒక నాటకం.కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, ఒక రాజకీయ అండ దొరుకుతుందని రాహుల్ గాంధీ భావించి ఈ ప్రజెంటేషన్ చేశాడని విశ్లేషకులు స్పష్టం చేశారు.ప్రతి ఎన్నికల అప్పుడు కొత్తగా ఓటర్లు నమోదు కావడం సర్వసాధారణం.

### - 1957 లో జరిగిన భారత తొలి సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 17 కోట్ల ఓటర్లతో భారత ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది

అప్పుడున్న జనాభా ప్రకారం మొత్తం భారతదేశ ఓటర్లు కేవలం 17 కోట్లు.

### - ఇప్పుడు భారత దేశంలో దాదాపు 97 కోట్ల నుండి 100 కోట్ల వరకు ఓటర్లు నమోదు చేయబడ్డారు

ప్రతి సంవత్సరము కొత్త ఓటర్లు చేరుతూనే ఉంటారు.అలాగే ప్రతి రాష్ట్రంలో ఏ ఎన్నిక అయినా కొత్త ఓటర్లు చేరడానికి ఎన్నికల కమిషన్ అవకాశం ఇస్తుంది.ఈ ఆనవాయితీ కొనసాగుతూనే ఉంటుంది.భారతీయ జనతా పార్టీ బలపడుతూ రావడం రాహుల్ గాంధీకి గానీ కాంగ్రెస్ పార్టీకి గాని రుచించడం లేదు. బిజెపి లాగా మోడీ లాగా ప్రజల విశ్వాసాన్ని పొందడం రాహుల్ గాంధీ బాధ్యత. అది కాంగ్రెస్ పార్టీ పనితీరుపై ఆధారపడి ఉంటుంది.ఆడ లేక మద్దెల ఓడు అనే సామెత లాగా తమ వైఫల్యాన్ని మోడీకి అంటగట్టాలని రాహుల్ గాంధీ విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.నిరంతరం మోడీపై ఎన్ని ఆరోపణలు చేసిన అవన్నీ కూడా నిర్వీర్యం అవుతుంటే రాహుల్ గాంధీకి ఒక అసహనం ప్రారంభమైనట్టుగా అనిపిస్తున్నది.

### - మోడీపై అక్కసు తో ఎన్నికల కమిషన్ పై ఆరోపణలా ?

రాహుల్ గాంధీ రాజకీయాలను ఒక పిల్లలాటగా భావించడం అతని అపరిపక్వతను సూచిస్తుంది తప్ప ఫలితం ఉండదు.రాహుల్ గాంధీ పరిణతి చెందిన రాజకీయ నాయకుడిగా కనిపించాలనుకున్నప్పుడు విశ్వసనీయత పెంచుకోవాలి. ప్రజలను ఆకట్టుకోవాలి. నమ్మకం పెంచుకోవాలి.మోడీని బిజెపిని లేదా ప్రజాస్వామిక వ్యవస్థను నిందించడం వల్ల రాహుల్ గాంధీ వ్యక్తిత్వం పల్చబడడం తప్ప ఉపయోగం లేదు. దేశంలోని యువ ఓటర్లను ఆకర్షించడానికి ఇటువంటి నిరాహార ఆరోపణలతో రాహుల్ గాంధీకి నష్టం తప్ప లాభం లేదు.దేశంలో కులగణన పేరుతో, మైనారిటీ బుజ్జగింపు రాజకీయాల పేరుతో కాలం చెల్లిన కార్యాచరణతో రాహుల్ గాంధీకి గాని, కాంగ్రెస్ పార్టీకి గాని ఎలాంటి లాభం చేకూరే అవకాశం లేదు. రాజ్యాంగబద్ధ ఎన్నికల కమిషన్ పై రాహుల్ గాంధీ ఇలా ఆరోపణలు చేసి కాలం గడపడం మన ప్రజాస్వామ్య ఆరోగ్యానికి మంచిది కాదు. ఇటువంటి చవక బారు ప్రజెంటేషన్ లతో ఒకరోజు రెండు రోజులు మీడియాలో చర్చల్లో ఉండడం తప్ప, ప్రయోజనం ఉండదు అనే విషయాన్ని రాహుల్ గాంధీ గ్రహిస్తే మంచిది.ఎన్నికల కమిషన్ పై నేను అణుబాంబు ను ప్రయోగించబోతున్నానని ఊరించి రాహుల్ గాంధీ ప్రయోగించింది ఆట బాంబు మాత్రమే.
నేను ప్రదర్శించబోయే సమర్పించబోయే ఆధారాలతో ఎన్నికల సంఘం ఎక్కడ దాక్కుంటుందో, ఎక్కడికి పారిపోతుందో ఎన్నికల కమిషన్ గమనించాలని రాహుల్ గాంధీ పలికిన బింకం ఒక నీటి బుడగలా తేలిపోవడం బాధాకరం.ఇది భారత ప్రజాస్వామ్యానికి తల వంపు.
రాహుల్ గాంధీ ఇలా ఆరోపణలు చేయడము, కోర్టు కేసులు ఎదుర్కోవడము, చివరికి క్షమాపణలు కోరడము ఒక మామూలు విషయంగా భావిస్తున్నట్టు ఉన్నది.ఈ ప్రవర్తనతో రాహుల్ గాంధీ వార్తల్లో వ్యక్తిగా మిగలడం తప్ప, పరిపూర్ణ నాయకుడిగా కనిపించడం లేదని భారత పౌరులు భావిస్తున్నారు.

### - సంచలనాల రాజకీయాలు మాని, రాహుల్ గాంధీ భారత ప్రజల అభిమాన నాయకుడిగా మన్నన పొందాలని కోరుకోవడం తప్ప ఎవ్వరూ చేసేదేమీ లేదు

## గంజాయి వద్దు.. ఆరోగ్యం ముద్దు! పట్టణంలో విస్తృతంగా సామాజిక కార్యకర్త వేణుగోపాల్ ప్రచారం.

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ ఆగస్ట్ 8:** గంజాయి వద్దు ఆరోగ్యం ముద్దు అంటూ హుజురాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ శుక్రవారం పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గంజాయి వద్దు ఆరోగ్యం వద్దు ఆ అనే బోర్డును తన మెడలో వేసుకుని సబ్ రిజిస్టర్ ఆఫీసు ఎస్సార్ ఆసుపత్రి ఏరియా, భరత్ పంప్ ఏరియా, సిరసపల్లి క్రాస్ రోడ్ తదితర ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు గ్రహీత నలుబాల వేణుగోపాల్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి ఇతర నిషేధిత మత్తు పదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని కోరారు. డ్రగ్స్, గంజాయి ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రంలోకి రాకుండా




సమూలంగా అరికట్టాలన్నారు. డ్రగ్స్, నిషేధిత మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, అందుకు అనుగుణంగా ఇటీవల ఉక్కు పాదం మోపుతోందని గుర్తు చేశారు. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్య విద్యను అభ్యసిస్తున్న మెడికోలు గంజాయి మత్తులో తూలుతూ గంజాయినీ సేవించడం ఎంతో బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రమక్రమంగా గంజాయి వినియోగం ఇటీవల పెరుగుతున్నట్లు మీడియా ద్వారా




తెలుస్తుందని ఇప్పటికైనా పోలీస్ డిపార్ట్మెంట్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని వేణుగోపాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి రమేష్, మడుగు రమేష్, కారంకంటి రవీందర్, ఆదిమూలము అజయ్, కొల్లూరి ఆనంద్, పరకాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు చీరల పంపిణీ హాజరైన మున్సిపల్ కమిషనర్ అయాజ్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 8**
జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన మేదరి సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మధిర రవీందర్ తల్లి కీర్తిశేషులు మదిరే రామమ్మ రెండవ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం మున్సిపల్ కార్మికులకు చీరలు పండ్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సేవలు మరువలేని వని కార్మికుల వల్లే పట్టణం కాలనీలు సుందరంగా ఉంటాయన్నారు బార్డర్లో జవాన్లు దేశం కోసం పోరాటం చేస్తుంటే మున్సిపల్ కార్మికులు పట్టణ ప్రజల ఆరోగ్యం బాగుండేందుకు వారు అనేక కష్టనష్టాలు ఓర్చుకొని పనిచేస్తుంటారని అలాంటి కార్మికులను గుర్తించుకొని చీరలు పంపిణీ చేస్తున్న మధిర రవీందర్ ను కమిషనర్ అభినందించారు కార్మికులను ప్రజలు గౌరవించినప్పుడే పట్టణం మరింత సుందరంగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజిరెడ్డి శానిటరీ ఇన్స్పెక్టర్ మహేష్ తదితరులు ఉన్నారు

# మోసాలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్టు






- కుదువ పెట్టిన నాలుగు కార్లు స్వాధీనం

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
కార్లు కుదవ పెట్టి మోసాలకు, బెదిరింపుల కు పాల్పడుతున్న నిందితుడిని గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ లు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.గోదావరిఖని ఎల్బీనగర్ కు చెందిన మారుపేల్లి ప్రణయ్ భాస్కర్, జూపాక పుష్ప లత, వనం శ్రీనివాస్ ల ను నిందితులుగా గుర్తించారు. పోలీస్ లు చెప్పిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.గోదావరిఖని ఎల్బీనగర్ కి చెందిన బోడ తిరుపతి అనే వ్యక్తి తన కారు, ఇంకా కొంతమంది మంది కార్లు కుదువ పెట్టి తిరిగి ఇవ్వడం లేదని తన కారు ఇప్పించి ప్రణయ్ భాస్కర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసాడు. ఫిర్యాదు ఆధారంగా గోదావరిఖని వన్ టౌన్ సీఐ ఇంద్రసేన రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.. నిందితున్ని పట్టుకొని విచారించి నిందితుడు ఎవరి ఎవరి వద్ద కార్లు కుదవ పెట్టాడో వారి వద్ద నుండి నాలుగు కార్లు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ తరలించి నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరుగుతుందని గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ మీడియా కు వివరాలు వెల్లడించారు. నిందితుడు ప్రణయ్ భాస్కర్ కారు డ్రైవర్ గా పని చేస్తూ డబ్బులు చేబదులు తీసుకోనేవాడు. తెలిసిన వారి వద్ద నుండి కార్లను కిరాయికి తీసుకొని నడిపిస్తాని,నెల నెల కిరాయి ఇస్తా నని నమ్మించెవాడు. కొన్ని రోజులు కిరాయి ఇవ్వడం తరువాత కొద్ది రోజులకు జల్సాలకు అలవాటు పడిన ప్రణయ భాస్కర్ తను తెలిసిన వారి వద్ద కార్లు తనఖా పెట్టే వాడు ఒక్కొక్కరి దగ్గర నుండి సుమారు రెండు లక్షల నుండి మూడు లక్షల వరకు తీసుకొని జల్సాలు చేస్తూ కారు యజమానులకి డబ్బులు ఇవ్వకుండా ఫోన్లో స్పందించకుండా హైదరాబాదులో తప్పించుకు తిరుగుతున్నాడు. ఈ విధంగా సుమారు రూ.10,00 000 లక్షల రూపాయల వరకు కార్లు కుదవ పెట్టి డబ్బులు తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా ఏసీపీ ఎం. రమేష్ మాట్లాడుతూ ఎవ్వరు కూడా తమ అవసరాల కోసం వాహనాలు తనఖా పెట్టుకునే ముందు వారి పూర్తి వివరాలు తెలుసుకువాలన్నారు. డబ్బులు ఇచ్చే వారు కూడా వాహనాల అసలు యజమాని, వారి వివరాలు, పూర్తి పత్రాలు తప్పనిసరిగా చూడాలన్నారు. వాహనం కు సంబందించిన వారు కాకుండా వేరే వారు తనఖా పెడితే తీసుకోని డబ్బులు ఇవ్వడం వలన ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. చట్టరీత్యా నేరం కావున వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నిందితున్ని పట్టుకొని కార్లు స్వాధీనం చేసుకోవడం కోసం కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్స్ రమేష్, సదానందం, కానిస్టేబుల్ మధుకర్, రమేష్ లను గోదావరిఖని ఏసీపీ అభినందించారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతం.

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఆగస్టు 9.**





జమ్మికుంట పట్టణంలోని వెంకటాద్రి నగర్ లో రామానుజ చిన్న జీయర్ స్వామి మంగళ శాసనములతో వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించడం జరిగింది ఆలయ ప్రధాన అర్చకులు డింగిరి హరికృష్ణ ఆచార్యులు వేణుగోపాల ఆచార్యులు వరలక్ష్మి అమ్మవారి అష్టోత్తర పూజలు కుంకుమ పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మక్కా జితేందర్ గుప్తా పుల్లూరి ప్రభాకర్ రావు జిగురు సదానందం అంతం రాజిరెడ్డి పుల్లూరి శ్రీనివాస్ ఎదులాపురం వెంకటేష్ ఆండోల్ గోష్టి మహిళా సభ్యులు భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొనడం జరిగింది.

# నేడే రాఖీ పౌర్ణమి వేడుకలు

- అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాలకు సూచక రక్షా బంధన్

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
రాఖీ..రక్షా బంధన్ లేదా రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణ పౌర్ణమి లేదా జంద్యాల పూర్ణిమ అని కూడా పిలుస్తారు. అన్నాచెల్లెళు లేదా అక్కాతమ్ముళ్ల మధ్యన ప్రేమానురాగాలకు సూచకంగా ఈ పండుగను జరుపుకుంటారు. అన్నకుగాని తమ్మునికిగాని ప్రేమ సూచకంగా సోదరి



కట్టే రాఖీ అని పిలిచే ఒక పట్టీని కట్టడం ఈ పండుగ ప్రాధాన్య విశేషం. రాఖీ అనగా రక్షణ బంధం. ఇది అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ళు జరుపుకునే మహోత్తరమైన పండుగ. చెల్లి తన అన్నయ్య మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అన్నయ్యకు కట్టేదే ఈ రాఖీ. సాధారణంగా జంధ్యాన్ని ధరించేవారు ఈ రోజునే పాతది వదిలి కొత్త దానిని



ధరిస్తారు. ఉపనయనం అయిన వారు జంధ్యాల పౌర్ణమి రోజు గాయత్రీ పూజచేసి కొత్త య్ఞపవీతాన్ని ధరించి పాతది తీసివేస్తారు.

**చరిత్రలోకి వెళ్తే:**
ఇతిహాసాల ప్రకారం చూస్తే ద్రౌపది, శ్రీకృష్ణుల అన్నాచెల్లెల అనుబంధం అత్యంత గొప్ప అనుబంధంగా కనిపిస్తుంది. శిశుపాలుడిని శిక్షించే క్రమంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగించిన కృష్ణుని చూపుడు వేలుకు రక్తం ధారగా కారుతుందట. అది గమనించిన ద్రౌపది తన పట్టుచీర కొంగు చింపి వేలికి కట్టు కట్టిందట. దానికి కృతజ్ఞతగా ఎల్లవేళలా అండగా ఉంటానని శ్రీకృష్ణుడు ద్రౌపదికి హామీ ఇస్తాడు. అందుకు ప్రతిగా దుశ్శాసనుడి దురాగతం నుండి ఆమెను కాపాడుతాడు.

**అలెగ్జాండర్ కథ:**
చరిత్రపుటల్లో అలెగ్జాండర్ భార్య 'రోక్సానా' తక్షశిల రాజు పురుషోత్తముడిని తన సోదరుడిగా భావించి రాఖీ కడుతుంది. జగజ్జేతగా మారాలనే తపనతో గ్రీకు యువరాజు అలెగ్జాండర్ క్రీస్తు పూర్వం 326లో భారత దేశంపై దండెత్తుతాడు. ఆ క్రమంలో బాక్ట్రియా (నేటి ఆఫ్ఘనిస్తాన్ )కు చెందిన యువరాణి రోక్సానాను వివాహం చేసుకుంటాడు. ఆమె వివాహసంబంధాన్ని ఉపయోగించుకుని మధ్య ఆసియా దేశాలను, ముఖ్యంగా జీలం, చినాబ్ నదుల మధ్య ఉన్న రాజ్యాలను జయించాలని అలెగ్జాండర్ ఆలోచన. అలెగ్జాండర్ యుద్ధం ప్రకటిస్తాడు. పురుషోత్తముడి శత్రు రాజు అంబి, అలెగ్జాండర్‌ను భారతదేశంపై దండెత్తాలని ఆహ్వానిస్తాడు. పురుషోత్తముడు యుద్ధానికి సిద్ధమవుతాడు. అయితే అలెగ్జాండర్ భార్య రోక్సానా పురుషోత్తముడిని తన అన్నలా భావించి రాఖీ కడుతుంది. తన భర్త అయిన అలెగ్జాండర్‌ను చంపవద్దని రోక్సానా పురుషోత్తముడిని కోరుతుంది. దీంతో పురుషోత్తముడు యుద్ధం గెలిచినా అలెగ్జాండర్‌ను చంపకుండా విడిచిపెడతాడు.

**రాఖీ ఏ సమయంలో ఎలా కట్టాలి:**
రాఖీపౌర్ణమి రోజు మహిళలు వారి సోదరుల ఇంటికి వెళ్తారు. ముందుగా తమ సోదరుడికి కుంకుమ బొట్టు పెట్టాలి. అలాగే కొందరు గంధం పెట్టిన తర్వాత కుంకుమ కూడా పెట్టవచ్చు. కుంకుమ బొట్టు పెట్టిన తర్వాత తలపై అక్షింతలు వేయడం ఆనవాయితి. రాఖీ కట్టే ముందు యేన బద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబలః తేన త్వామభి బద్నామి రక్ష మాచల మాచల" అనే శ్లోకాన్ని చదివి రాఖీ కడతారు. రాఖీ కట్టిన తర్వాత తమ సోదరుడిని ఆశీర్వదీస్తూ అక్షింతలు వేయాలి. రాఖీ కట్టిన తర్వాత సోదరీలు హారతి ఇస్తారు. అనంతరం ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటారు.

# ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి నూతన ఉత్సవ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

- ప్రత్యేక పూజ కార్యక్రమాలు, పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు





**కరపత్రం ప్రతినిధి-హుజూరాబాద్:**
హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపులో గల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, సుదర్శణ నారసింహ ఉత్సవ మూర్తి ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కాగా నూతన ఉత్సవ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు మంగళవారం నుండి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు నిఖిలాచార్యులు, నందకిశోరాచార్యులు, శ్రీహర్షచార్యులు, సుదర్శనా చార్యులు, రామాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విగ్రహాలను గూడూరు ప్రభాకర్ రెడ్డి సుమావాణి, ఊరడి సుధాకర్ రెడ్డి-సుగుణ, పీవీ నరేష్, సారయ్య- సుజాత, చందా నగేష్- జ్యోతి, రాజు, సురేందర్, గణపతిరెడ్డి బహూకరించారు. కాగా శుక్రవారం ఆలయంలో ప్రాయశ్చిత్త హెూమం, మహా పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాల తో పాటు, నేత్రోన్మలనం, కుంభప్రోక్షణ, ద్రిష్టి కుంభ, శాంతి కళ్యాణం, ఋత్విక్ గరణం, మహదాశీర్వచనం, తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మోహన్ రెడ్డి దంపతులతో పాటు, ఉపాసి సురేందర్ దంపతులు తోపాటు భక్తులు పాల్గొన్నారు.

# ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించొద్దు, కలెక్టర్ డిమాండ్కు అనుగుణంగా నిలువలు ఉన్నాయి,మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
ఎరువులు కుత్రిమ కొరత సృష్టించద్దని డిమాండ్కు అనుగుణంగా నిలువలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ . రాహుల్ రాజ్ స్పష్టం చేశారు.శుక్రవారం మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో తెలంగాణ ఆగ్రో రైతు సేవా కేంద్రం ను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు డిమాండ్కు అనుగుణంగా ఉన్న నిలువలను పరిశీలించారు, స్టాక్ వివరాలను, ఆన్లైన్ తదితర వివరాలను డీలర్లు అడిగి తెలుసుకున్నారు, ప్రస్తుత సీజన్కు అనుగుణంగా జిల్లాలో తగినన్ని ఎరువులు విత్తనాలు ఉన్నాయని కొంతమంది కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు,రైతులతో స్వయంగా మాట్లాడుతూ వారికి కావలసిన సమాచారాన్ని అందించారు రైతులు జిల్లాలో ముందస్తుగా ఎరువులు



విత్తనాలు యూరియా డిఏపి తదితర ఫర్టిలైజర్స్ లో వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచుకోవడం జరిగిందని తెలిపారు,కల్తీ విత్తనాలు అమ్మిన, అధిక ధరలకు విక్రయించిన, ప్రభుత్వం సూచించిన ప్రకారం సంబంధిత వ్యక్తులపై శాఖపరమైన చర్యలు తీసుకుని



లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని అన్నారు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది క్రమం తప్పకుండా సంబంధిత అధికారులతో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు,ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సంతోషిమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
కరీంనగర్ పట్టణంలోని సంతోష్ నగర్ సంతోషి మాత దేవాలయంలో శ్రావణ శు క్రవారం వరలక్ష్మీ వ్రతాల సందర్భంగా ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.తెల్లవారుజామున అభిషేకాలు, కుంకుమ అర్చనలు చేసి, అమ్మవారిని వేలాది పూలతో అలంకరించారు. గత 35 సంవత్సరాలుగా భక్తుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షులు కొక్కిరాల సాగర్ రావు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

# మొక్కలతోనే మానవుడికి ప్రాణవాయువు అదనపు కలెక్టర్ నగేష్

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
మానవాళికి ప్రాణవాయువు అందించే మొక్కలను పెంచే బాధ్యత మనమందరం తీసుకుందామని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. శుక్రవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్, మనోహరాబాద్ మండలంలో
లోకేష్ మిషన్స్ కల్లాకల్ ఇండస్ట్రియల్ ఎస్టేట్లో అదనపు కలెక్టర్ నగేష్ వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ జిల్లా పరిశ్రమల శాఖ వనమహోత్సవ లక్ష్యాల మేరకు మొదటి విడతలో 2000 మొక్కలు నాటుతున్నారని,రెండో విడతలో ఇంకొక 3000



మొక్కలు , మొత్తం 5000 మొక్కలు నాటుతున్నారని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ మెదక్ జనరల్ మేనేజర్ ప్రకాష్ రావు



ఫారెస్ట్ డిపార్ట్మెంట్ మరియు రెవెన్యూ డిపార్ట్మెంట్ నుంచి తాసిల్దార్ లోకేష్ మిషన్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు సిబ్బంది వారి ఎంప్లాయిస్ పాల్గొన్నారు

# తోషిబా కంపెనీ విస్తరణలో భాగంగా రూ. 562 కోట్లతో నూతన యూనిట్లకు భూమి పూజ



**మంత్రులు డా. వివేక్ వెంకటస్వామి, శ్రీధర్ బాబు చేతుల మీదుగా**
సంగారెడ్డి జిల్లా రూద్రారం లో ఉన్న తోషిబా కంపెనీ విస్తరణ ప్రణాళికలో భాగంగా రూ. 562 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన తయారీ యూనిట్లకు ఈ రోజు భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ వేడుకలో తెలంగాణ రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఈ విస్తరణతో స్థానిక యువతకు కొత్త ఉద్యోగ అవకాశాలు లభించడమే కాకుండా, ప్రాంతానికి పారిశ్రామిక అభివృద్ధి కలుగుతుంది. అదేవిధంగా, మరిన్ని పెట్టుబడులకు ఇది దారితీస్తుంది" అన్నారు."భవిష్యత్తులో మరిన్ని మల్టీ-నేషనల్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడి పెట్టేందుకు ఈ విస్తరణ ఒక మార్గదర్శకంగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.